# ప్రయాణంలో పదనిసలు

గోదావరి ఎక్స్‌ప్రెస్ కదలడానికి సిద్ధంగా ఉంది. ఆఖరు నిమిషంలో ఆదరాబాదరాగా వచ్చి ట్రైన్ ఎక్కిన డాక్టర్ శ్రీదేవి తన సీటు నంబర్ వెతుక్కుంటూ వచ్చి, నంబర్ చూసి వెంట తెచ్చుకున్న చిన్న సూట్‌కేస్ సీటు కిందకు తోసి, చిన్న ప్లాస్టిక్ బుట్ట బల్లమీద పెట్టి కిటికీ పక్క సీటులో చతికిలబడి సెటిల్ అయింది. ఏ.సి. టూ టైర్ పెట్టె చల్లదనం చెమటను తగ్గించాక సేదతీరి చుట్టూ చూసింది. ఎదుటి సీటులో ముప్ఫై ఏళ్ళ అమ్మాయి కూర్చుని ఉంది. చూడగానే ఎక్కడో చూసిన మొహం అనిపించింది కానీ, ఎక్కడ చూసిందీ, ఎవరో ఎంత గుర్తు చేసుకున్నా గుర్తు రాలేదు. ఆమె పక్కన ఏడెనిమిదేళ్ల బాబు ముద్దుగా, బొద్దుగా, చక్కగా మంచి మానర్స్‌తో పెరిగిన పల్లాడిలా చదువుతున్న పుస్తకం చూపిస్తూ తల్లిని చాలా లో గొంతుతో ఏదో అడుగుతున్నాడు, అమెరికన్ ఏక్సెంట్ ఇంగ్లీషులో తల్లి విడమర్చి చెపుతుంటే శ్రద్ధగా వింటున్నాడు. ఇద్దరూ చాలా తక్కువ స్థాయి గొంతులతో మాట్లాడుకోవడం ఆ అబ్బాయి ఇంగ్లీషు వింటుంటే అమెరికాలో పుట్టి పెరిగిన అబ్బాయి అని చెప్పకుండానే తెలుస్తుంది. వాళ్ళిద్దరి తరువాత ఎవరో బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లా టై అదీ కట్టుకున్న నడివయసు మనిషి బ్రీఫ్‌కేస్ తెరిచి ఏవో ఆఫీస్ కాగితాలు చదువుకుంటున్నాడు. పక్కన ఇద్దరు నడివయసు దాటిన తమిళ భార్యాభర్తలు-ఇద్దరూ ఏదో మాట్లాడేసుకుంటున్నారు.

ట్రైన్ కదిలింది. అరక్షణం తీరిక లేని ప్రాక్టీస్ నుంచి ఒక రోజు తీరిక చేసుకుని తమ్ముడి దగ్గరున్న తల్లిని చూడడానికి వెళ్ళాల్సిన పరిస్థితి. ఎనభై ఏళ్ళ ఆవిడ పడితుంటి ఎముక విరిగి నెల రోజులుగా మంచం పట్టింది. చూడాలని ఉందంటోందని ఫోన్ల మీద ఫోన్లు వస్తుంటే ఆదివారం కలిసి వచ్చేటట్టు ఈ ప్రయాణం పెట్టుకుంది హైదరాబాద్‌కి డాక్టర్ శ్రీదేవి. ఎప్పుడో గానీ దొరకని ఈ తీరిక, ఫ్లస్ ఏ.సి కంపార్ట్‌మెంట్ చల్లదనం- రెండూ కలసి ఏదో ఆటవిడుపులా అనిపించింది. చిన్నప్పటి నుంచి రైలు ప్రయాణం ఎంతో ఇష్టం తనకు. చిన్నప్పుడు కిటికీ బయటి దృశ్యాలు. పెద్దయ్యాక లోపలి మనుషులను పరిశీలించడం ఇష్టమైన విషయం.

మళ్ళీ శ్రీదేవి దృష్టి ఎదుటి బెర్త్ అమ్మాయి మీద పడింది. 'ఎక్కడ చూశా చెప్మా' అన్న ఆలోచనలో పడింది. 'ఎక్కడ చూశా చెప్మా' అన్న ఆలోచనలో పడింది. డాక్టరుగా

ఎందరో పేషెంట్లని చూస్తుంటుంది రోజూ తాను. అలా ఈ అమ్మాయిని చూసి ఉండవచ్చు. అదే సమయంలో ఆ అమ్మాయి శ్రీదేవి వంక చూసి పలకరింపుగా నవ్వింది. "నన్నెక్కడో చూశానని అనిపిస్తోంది కదూ మీకు. మిమ్మల్ని నేను చూడగానే గుర్తించాను. మీరు నన్ను గుర్తిస్తారో, లేదోనని చూస్తున్నాను" నవ్వుతూ అంది ఆ అమ్మాయి.

"ఎక్కడో చూశాననిపిస్తుంది గాని గుర్తురాలేదమ్మా బహుశా ఏ పేషెంటో అయి ఉంటావనుకున్నాను" అంది నిజాయితీగా శ్రీదేవి.

"కరక్టే. రోజూ ఎంతోమంది వచ్చిపోతుంటారు గదా. అందులో పదేళ్ళ క్రితం సంగతి కదా" చిన్న క్లూ దొరికినట్లయింది శ్రీదేవికి ఆ మాట వినగానే.

"ఆఁ... ఆఁ... గుర్తు వస్తోంది. ఆ రోజు అబార్షన్‌కి..." శ్రీదేవి ఏదో చెప్పబోతుంటే పక్కన పిల్లాడు వింటున్నాడన్నట్టు సంజ్ఞ చేస్తూ, "డాక్టర్ మీరానాడు సరైన సలహా ఇచ్చినందుకు నేనీనాడు కృతజ్ఞత చెప్పుకుంటున్నాను. మీ మాట వినకుండా ముందు మొండికేసినా, తరువాత ఎందుకో మీ మాటలు, సలహాలో ఏదో ఔచిత్యం కనపడి నన్ను వెనక్కి లాగింది. అందుకే రోజు ఆలస్యంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. అప్పుడు దేశం విడిచి అమెరికా వెళ్ళిపోయాను. మళ్ళీ నెలరోజుల క్రితం వచ్చాను. ఇంకో వారం రోజుల్లో మళ్ళీ వెళ్ళిపోతాను. ఇవాళ ఇక్కడ మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది"

"ఈ బాబు ఆ బాబేనా!" సందేహంగా అడిగింది. "నీ పేరు సుహాసిని కదా". "అవును డాక్టర్. ఆ బాబే... డాక్టర్ మీ మాట వినకపోయి ఉంటే ఎంత అపురూప అనుభూతిని పోగొట్టుకునేదాన్నో. వీడు నా ప్రాణం, నాకు అండదండ, ఆసరా. ఇంత గొప్ప వరాన్ని మూర్ఖంగా పోగొట్టుకునేదాన్ని. నిజంగా మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడంలేదు".. చాలా ఎమోషనల్‌గా అంది సుహాసిని.

"ఈ తృప్తి చాలమ్మా. ఇంతకంటే ఇవ్వడానికి, పుచ్చుకోవడానికి ఏం ఉంది".

ఆ రోజు క్లినిక్‌లో పన్నెండు గంటల వేళ వచ్చింది సుహాసిని. వస్తూనే చాలా ఎమోషనల్‌గా ఏడుపు మినహా ఉన్న మొహంతో ఉపోద్ఘాతం లేకుండా, "నాకు అబార్షన్ చెయ్యాలి డాక్టర్" అంది సూటిగా.

శ్రీదేవి తలెత్తి ఆమె కళ్ళలోకి చూసి, "కూర్చోముందు" అంది. సుహాసిని కూర్చున్నాక "అన్‌మారీడా" అది అనుమానంగా, మెడలో మంగళసూత్రం కోసం కళ్ళతో గాలిస్తూ.

"ఛ, అది కాదు, పెళ్ళయింది. ఈ ప్రెగ్నెన్సీ ఇప్పుడు వద్దనుకుంటున్నాను" అంది కాస్త దూకుడుగా.

"మీవారూ దీనికి అంగీకరించారా? ఆయనా అబార్షన్ కోరుతున్నారా? ఆయన రాలేదు! మీవారి పర్మిషన్ ఉండాలి గదా".

"అవసరం లేదు. ఆయనకి నేను ప్రెగ్నెంట్ అని ఇంకా తెలీదు. జస్ట్ ఫైవ్ అండ్ ఆఫ్ వీక్స్ అందుకే తొందరగా చేయించుకోవాలనుకుంటున్నాను"

"భర్తకి తెలీకుండా, భర్త సంతకం లేకుండా అబార్షన్ కుదరదమ్మా, ఇంతకీ అబార్షన్ ఎందుకు కావాలనుకుంటున్నావు? ఫస్ట్ ప్రెగ్నెన్సీ టెర్మినేట్ చేసుకోవడం మంచిది కాదమ్మా. అలా చేయించుకున్న కొన్ని కేసులలో మళ్ళీ కావాలనుకున్నప్పుడు గర్భం రాక చాలా మంది బాధపడిన కేసులు నాకు తెలుసు.

"ఫరవా లేదు డాక్టర్. ఇప్పుడవన్నీ ఆలోచించే ఓపిక, తీరిక నాకు లేదు. భవిష్యత్తు గురించి ఆలోచించే స్థితిలో లేను నేను. ప్లీజ్ ఎప్పుడు రమ్మంటారో చెప్పండి. లేదా ఇప్పుడే చేసినా నేను రెడీ. అయిదు నిమిషాల పనిట కదా!" ఆరాటంగా అంది.

"సరే నీ ఇష్టం. కానీ, మీవారిని తీసుకొని రేపు తొమ్మిది గంటలకల్లా వస్తే చేస్తాను. కానీ, మరోసారి ఆలోచించుకో. డాక్టరుగా నా సలహా పాటించదలిస్తే ఈసారికి బిడ్డని కని, ఇంకోసారి జాగ్రత్తగా ప్లాన్ చేసుకో. కాదూకూడదంటే రేపు నీ భర్తని తీసుకురా".

"ఆయన రాకపోతే అబార్షన్ చేయరా?" సందేహంగా అడిగింది. "పెళ్ళయితే భర్త, లేదంటే పేరెంట్స్ ఎవరన్నా ఉండాలి రూలు ప్రకారం".

"డాక్టర్‌గారూ, నా భర్తకు తెలియకుండా అబార్షన్ చేయించు కోవాలనుకుంటు న్నానని చెప్పాగా. తెలిస్తే ఆయన ఒప్పుకోకపోవచ్చు"

"మరి అలాంటప్పుడు నేనెలా చేస్తానమ్మా? రేపు ఏదన్నా గొడవ చేస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారు? మా రూల్సు మాకుంటాయి"

ఆలోచనలో పడింది సుహాసిని.

"నీ ప్రాబ్లమ్ ఏమిటో చెప్పమ్మా. అతనికి ఎందుకు తెలియకూడదనుకుంటున్నావు?

ఒక నిమిషం చెప్పాలా, వద్దా అన్న సందిగ్ధత కనిపించింది ఆమె మొహంలో. "డాక్టర్‌గారూ నా భర్తకీ, నాకూ సరిపోవడం లేదు. మేం ఇద్దరం ఇక కలిసి కాపురం చెయ్యలేకపోవచ్చు. నేను నా భర్త నుంచి విడిపోవాలనుకంటున్నాను. అలాంటప్పుడు ఈ ప్రెగ్నెన్సీ నాకిష్టం లేదు. దీనివల్ల కాంప్లికేషన్స్ వస్తాయి. పిల్లో, పిల్లాడో పుడితే నే వదలలేక పోవచ్చు. అతను నా బిడ్డ అనొచ్చు. ఈ గొడవలు వద్దనుకొని ఎవరికీ తెలియకుండా అబార్షన్ చేయించుకోవాలనుకుంటున్నాను. ప్లీజ్! మీరు కాస్త హెల్ప్ చెయ్యాలి. దయచేసి భర్త పర్మిషన్ కావాలనకుండా సాయం చెయ్యండి. ఏదన్నా

ప్రాబ్లమ్ వస్తే జవాబుదారీ నాది. మీ పేరు ఎక్కడా రానీయను నేను" ప్రాథేయపడుతూ అడిగింది సుహాసినీ.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ - మీ ఇద్దరి మధ్యా గొడవలు మీ పెద్దలకు తెలుసా! విడిపోయే ముందు ఇద్దరు పెద్దలూ కలుగజేసుకుని..." ఓ డాక్టర్నన్న మాట మరిచి లాయరుగా సలహా ఇవ్వబోయింది. మధ్యలోనే అడ్డుకుంది సుహాసిని.

"తెలుసు డాక్టర్. చాలా వరకు తెలుసు. పెద్దలకు చెపితే ఏమంటారు. కలిసి బతకడానికి ప్రయత్నించాలి. సర్దుకుపోవాలంటారు విడిపోవడం వల్ల వచ్చే సమస్యలు భూతద్దంలో మాదిరి చూపిస్తారు"

"గొడవలు ఎందుకమ్మా. మీ పెళ్ళయి ఎన్నాళ్ళయిందసలు ఏమనుకోకు. ఈవిడేమిటి లాయరులా ప్రశ్నిస్తోంది అనుకోకు. కుతూహలం కొద్దీ అడుగుతున్నాను. నువ్వు ఉద్యోగస్థురాలివా..ఇది పెద్దలు చేసిన పెళ్ళేనా?

సుహాసినికి ఇదెక్కడి గొడవన్నట్లు విసుగనిపించినా, డాక్టర్ని మంచి చేసుకుంటే తన పని జరుగుతుందన్న ఆశతో, "డాక్టర్గారూ, నేను కంప్యూటర్ ఇంజనీర్ని. మంచి కంపెనీలో పెద్ద జీతం మీద పనిచేస్తున్నాను. అయినా ఇంజనీరే పెద్దలు కుదిర్చిన సంబంధమే. చూసి ఇష్టపడే చేసుకున్నారు. మనిషి బాగున్నాడు. ఫామిలీ బాగుంది. మనసు బాగుంటుంది. సంస్కారం ఉండవచ్చు అనుకుంటాం ఎవరన్నా. ఆ మనిషికి చదువున్నా, సంస్కారం శూన్యం అన్నది కాపురం చేశాక గదా అర్థం అవుతుంది. తన కంటె నా ఉద్యోగం మంచిది, జీతం ఎక్కువ అయితే అది నా తప్పా? చదువు అవగానే పెళ్ళి అయింది. అమెరికా వెళ్ళి ఎమ్మెస్ చేద్దామనుకునే లోపలే ఈ సంబంధం జత పడడంతో, మావాళ్ళు మంచి సంబంధం కావాలన్నప్పుడు దొరకదు అంటూ ఊదరగొట్టి, పెళ్ళయ్యాక అమెరికా వెళ్ళవచ్చు. చదవవచ్చు అని ఒప్పించి పెళ్ళి చేసేశారు. ఎమ్మెస్కి అప్లయ్ చేస్తుండగానే సత్యం కంప్యూటర్స్ మంచి పెద్ద జీతంతో ఉద్యోగం ఆఫర్ చేయడంతో కాదనలేక, అమెరికాకు మేం పంపిస్తాం అన్న ఆశ చూపడంతో ఉద్యోగంలో చేరాను. ఆయన పెళ్ళి వేళకే ఉద్యోగం చేస్తుండేవారు. నా ఉద్యోగం, జీతం పెద్దవడంతో ఆయనలో ఇగో ప్రాబ్లమ్ మొదలైంది. పెళ్ళయిన ఓ రెండు మూడు నెలల తిన్నగా ఉన్నారేమో, తరువాత అసలు రంగు బయటపడడం మొదలై ప్రతి చిన్నదానికీ తప్పులెంచడం, సాధింపులు, ఏ పని చేసినా దెప్పడం, ఇంటి పని నాదేనన్నట్ల ఒక్క పిసరు సాయం చేయకుండా కావాలని ఏడిపించడం, ఎదురు తిరిగితే పొగరని, ఉద్యోగస్థురాలినని గర్వం అని, మొగుడంటే లెక్కలేదని, ఏం చెప్పాలి యూజువల్ స్టఫ్, ఇన్ఫీరియారిటీ కంప్లెక్స్తో మగాడు ఎలా బాధపెడతాడో అలా బాధించడం మొదలు

పెట్టాడు. శాంతి, సుఖం, సారంలేని సంసారం అయింది. అయినా, ఓ ఏడాది భరించాను. రోజు రోజుకీ శాడిజం ఎక్కువవడం తప్ప తగ్గలేదు. ఈ లోగా నాకు అమెరికా చాన్సు వచ్చింది. అది మరింత కుళ్ళు అయింది. మా అధికారులు అమెరికా వెళ్ళి ప్రాజెక్ట్ వర్క్ చూడమని, వీలయితే అక్కడి ఆఫీసులో ఎడ్జస్ట్ చేస్తాం అన్నారు, అమెరికా వెళ్ళాలి అన్న నా ఉద్దేశం తెలుసు గనుక. అమెరికా వెళ్ళడానికి వీలు లేదట. నేనిక్కడ, నీవక్కడ ఎలా కుదురుతుంది? బోడి ఉద్యోగం, ఇది కాకపోతే ఇంకోటి. మానెయ్ అంటూ గొడవ. ఉద్యోగం మానే ప్రసక్తే లేదు, అమెరికా మానే ప్రసక్తి అసలే లేదు అని ఖచ్చితంగా చెప్పేసరికి నిప్పుతొక్కిన కోతే అయ్యారు. నేను మనసులో ఇంక ఈయనతో కలిసి ఉండడం అసాధ్యమని తేల్చుకొని మెంటల్‌గా సెపరేషన్‌కి సిద్ధపడ్డాను. మావాళ్ళతో, వాళ్ళ వాళ్ళతో చెప్పి మ్యూచువల్ డైవోర్సుకి ప్రయత్నిద్దాం అనుకునే లోపలే నా కర్మ కాలి ఈ ప్రెగ్నెన్సీ వచ్చింది. డాక్టరుగారూ, ఇలాంటివాడితో బిడ్డ కోసం కలిసి బతకలేను. ఈ బిడ్డ వల్ల నన్ను ఇరకాటంలో పడేసి కట్టడి చెయ్యొచ్చు అతను. అందుకే మిమ్మల్ని ఇంతగా అడుగుతున్నాను డాక్టర్".

"చూడమ్మా. నేనొక మాట చెపుతాను. ఇది డాక్టర్‌గా సలహా అనుకో, లేదంటే తోటి స్త్రీగా ఇచ్చే సలహా అనుకో. ఈ అబార్షన్ ఇప్పుడు చేయించుకోకు. నీవు ఎలాగా అమెరికా వెడతానంటున్నావు. నీ భర్తకి నీ ప్రెగ్నెన్సీ గురించి చెప్పకు. అమెరికా వెళ్ళి బిడ్డను కను. నీ వైవాహిక జీవితం పాడయింది. ఈ భర్త నుంచి డైవోర్స్ వచ్చాక వేరే ఎవరన్నా నీకు దొరకాలి. నచ్చాలి, మళ్ళీ మనసులు కలవాలి కదా. ఏ కారణం చేతనైనా నీవు రెండోసారి పెళ్ళి చేసుకోకపోతే ఈ బిడ్డ నీకు తోడు. అండ అవుతుంది. జీవితంలో ఒంటరి ప్రయాణం ఎన్నాళ్ళో చెయ్యలేం అమ్మా. వయసు కాస్త మీరాక ఒంటరితనం మధ్య అయ్యో ఈ బిడ్డ ఉండి ఉంటే బాగుండేది అని నీకు అనిపించే క్షణాలు రావచ్చు. అలాంటి కేసులు నేను చాలా చూశా, విన్నాను . అమెరికా వెళ్ళు, అక్కడ బిడ్డ తండ్రి పేరు ఏదో రాయించు. సింగిల్ మదర్స్ అక్కడ కొత్త కాదు. ఇక్కడలా పెళ్ళి, భర్త లేకుండా బిడ్డ ఎలా అన్న ఆరాలు ఎవరూ తీయరు. ఈ బాబో, పాపో నీకు భవిష్యత్తులో ఆనందాన్నివ్వచ్చు. నీకు తోడు, నీడ అవచ్చు. నీ ఒంటరి జీవితానికీ ఆలంబన కావచ్చు. ఒకవేళ మీ ఇద్దరూ తిరిగి కలుసుకున్నా, ఈ బిడ్డవల్ల నీకేం సమస్యలూ రావు. అసలు పిల్లలవల్లే మన దేశంలో నూటికి ఎనభై కాపురాలు నిలబడుతున్నాయి. నువ్వు మనసు మార్చుకుంటే, అక్కడికెళ్ళాక గర్భవతినన్న సంగతి తెలిసిందని నీ భర్తతో చెప్పు. లేదంటే గప్‌చుప్‌గా ఊరుకొని బిడ్డను కను".

"కానీ, డాక్టర్ ఒంటరిగా, ఉద్యోగం చేస్తూ ఈ బిడ్డని పెంచగలనా? ఎలా కుదురుతుంది?" సందిగ్ధంగా చూసింది సుహాసిని.

"చూడమ్మా, నీకు ఉద్యోగం ఎప్పుడూ ఉంటుంది. పిల్లల కోసం ఇంత చదువుకున్నాక ఉద్యోగం మానే ప్రసక్తి ఉండదు కదా. ఎప్పుడైనా పిల్లలని కని పెంచాల్సిందే కదా. అక్కడ చాలా సదుపాయాలున్నాయి. నువ్వు మంచి జీతంలో ఉన్నావు. మనిషి సాయంతో పిల్లని పెంచడం కష్టం కాదు. నీ భర్త సాయం నీకు ఏ విషయంలోనూ లేదంటున్నావు. అలాంటప్పుడు ఒంటరిగా పెంచాల్సిందే కదా ఎప్పుడైనా. ఆలోచించుకో. ఒకటి రెండు రోజులు బాగా ఆలోచించి నిర్ణయానికి రా. అప్పుడు కావాలంటే చేస్తాను నువ్వు కోరినట్టు అబార్షన్".

ఆనాడు డాక్టర్ శ్రీదేవి అలా అన్నాక, రాత్రి, ఓ పగలు ఆలోచించినా చెయ్యలేని నిర్ణయం తీసుకుంది. ఆ రాత్రి అతనితో పెద్ద ఘర్షణ పడ్డాక మగాడు, మళ్ళీ పెళ్ళి అంటే ఎంత ఏవగింపు కలిగిందంటే, జీవితంలో మగాడి పొందు ఎప్పుడూ కోరను. ఈ జన్మకి చాలు ఈ అనుభవం. ఈ బిడ్డని కని పెంచి, మగాడి అండలేకుండా ఆడది ఒంటరిగా బతకగలదు, పిల్లల్ని పెంచుకోగలదు అని తనకి తాను తెలియజెప్పుకోవడానికి, తనలాంటి అమ్మాయిలకి తెలియజెప్పాలన్న పంతం కలిగింది. 'బిచ్' అంటూ నోటికి రాని తిట్లు తిట్టిన అతనితో ఒక్కక్షణం కూడా కలిసి బతకనని నిర్ణయించుకుంది ఆ క్షణంలోనే.

"మళ్ళీ నువ్వు నా దగ్గరకు వచ్చి ఏ సంగతీ చెప్పనే లేదు" శ్రీదేవి అంది. "లేదు డాక్టర్. ఆ రాత్రి ఆయనతో గొడవపడి తెల్లారి అమ్మావాళ్ళ దగ్గరకి వెళ్ళిపోయి. వాళ్ళతో కూడా ఈ గొడవ చెప్పకుండా అమెరికా వెళ్ళే సంగతి మాత్రం చెప్పాను. ప్రయాణం ఏర్పాట్లు కంపెనీవారే చేసేవారు. వారం రోజుల్లో వెళ్ళిపోవడంతో మీ దగ్గరకి రావడానికి కుదరలేదు."

"మరి మీవారికి, మీ వాళ్ళకి ఎవరికీ తేలీదా ఈ బాబు సంగతి". ఆశ్చర్యంగా అడిగింది శ్రీదేవి. "మా ఆయనకి తెలీదు. అమ్మా వాళ్ళకీ బిడ్డని కన్న సంగతి చాలా రోజులు చెప్పలేదు. ఆయనతో డైవోర్సు అయ్యాక నెమ్మదిగా చెప్పాను మావాళ్లకి".

"అతను డైవోర్స్‌కి ఒప్పుకున్నాడా?"

"ఎవడి కోసం ఒప్పుకుంటాడు. నేనింక ఇండియా రానని, నీతో కలిసి బతకనని ఓ భార్య తేల్చి చెప్పాక ఓ మగాడు అలాంటి భార్యని బతిమలాడుతాడా. 'నీవు కాకపోతే మరొకతె. నీలాంటి పొగరుబోతు నాకవసరం లేదు' అని బింకాలు పోయాడు డాక్టర్, గమ్మత్తేమిటో తెలుసా! తరువాత అతను తిరిగి పెళ్ళిచేసుకున్నాడు. చదువుకున్న ఉద్యోగస్థురాలైన అమ్మాయి కాపురం సరిగా చెయ్యదని ఓ పల్లెటూరి, అట్టే చదువుకోని

అమ్మాయిని కావాలని చేసుకున్నాడు. కానీ, విచిత్రం చూడండి. చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం ఏమీ లేని ఆ అమ్మాయి అతని మీద ఎంత హోల్డ్ సాధించిందంటే, ఆ అమ్మాయి మాట జవదాటడట. కుక్కిన పేనులా ఏం చెయ్యమంటే దానికి తలూపుతాడట. నన్ను అన్ని రకాలుగా కాల్చుకు తిన్న అతనిప్పుడు ఓ హెన్‌పెక్డ్ హజ్బెండ్ అయిపోయాడట. మావాళ్ళు చెప్పారు.

'రెండోసారి పెళ్ళాం వదిలేస్తే తలవంపులని సర్దుకున్నాడేమో' డాక్టర్ నవ్వింది.

కరెక్ట్. ఆ మగాడి అహం దెబ్బ తింది కదా! రెండో పెళ్ళి పెళ్ళాంకి తెలిస్తే దెప్పుతుందని, అందూ ఏమనుకుంటారోనని పొగరు తగ్గించుకొని ఉంటాడు. ఏది ఏమైనా డాక్టర్, వీడిని కనకపోతే జీవితంలో చాలా మిస్ అయి ఉండేదాన్ని సుమా. మాతృత్వంలో మమత లాంటి మాటలు కాదు కానీ, ఓ ప్రాణిని ప్రపంచంలోకి తీసుకొచ్చి, ఆ బాబు పెరుగుతుంటే వాడు బోసి నవ్వులు, చిట్టి పాదాలతో అడుగులేయడం, మొదటిసారి అమ్మా అన్నప్పుడు కలిగిన ఆనందం, వాడి స్పర్శ, వాడి పెరుగుదలలో పాలు పంచుకుంటూ వీడు నా వాడన్న మోహం, పాశం-ఇవన్నీ అద్భుతమైన అనుభవాలు. మనిషి సెంటిమెంట్స్‌కి బానిస. కన్న కడుపు తీపి గురించి ఎవరు చెప్పినా నమ్మలేం, స్వయంగా అనుభవిస్తే తప్ప. ఇప్పుడు వీడితోనే నా బతుకు. బాబు లేకపోతే జీవితం ఎంత నిస్సారంగా ఉండేదో తల్చుకొన్నప్పుడల్లా మీరే గుర్తు వచ్చి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొనేదాన్ని".

మాటల్లో ఏదో స్టేషనులో రైలాగడం....పక్కన కూర్చున్న అరవ జంట దిగిపోయి ఒక ఫామిలీ ఎక్కారు. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు. హడావిడిగా ఎక్కి సామాను సర్దుకున్న అతను సుహాసినిని చూసి షాక్ తగిలిన వాడిలా నిలబడిపోయాడు. అదే క్షణంలో సుహాసినీ అతన్ని చూసి నిర్ఘాంతపోయింది. అతని మొహం గుర్తుపట్టనంత నల్లబడింది. మొహం తిప్పుకున్నాడు. సుహాసిని ఒక్క క్షణంలో తేరుకుని కావాలనే అతని వంక పట్టి పట్టి చూస్తూ నవ్వుకుంది. అతని భార్య పొట్టిగా, లావుగా చామన ఛాయగా ఇటు పాత కాక, అటు ఆధునికంగా కాక మధ్య రకంగా పట్టీలు, హైహీల్స్, రబ్బరు బ్యాండ్ కట్టిన జుట్టు, దాన్నిండా పూలు, గాజుల మధ్య వాచీ, నూనె పట్టించిన తల - వేషం కలగా పులగంగా ఉంది. మగ పిల్లాడు ఆరేడేళ్ళు, ఆడపిల్ల మూడు నాలుగేళ్ళు. ఇద్దరి డ్రస్సుల రంగులూ ఘోరంగా ఉన్నాయి. ఆవిడ దర్జాగా ఏ.సి. కంపార్ట్‌మెంట్ తనదేనన్నట్టు చూసి, "ఆ పెట్టె అక్కడ పెట్టారేమిటి? ఇటు మన బెర్తు కింద పెట్టండి. వాటర్ బాటిల్ అక్కడ గిలించండి. ఆ ప్లాస్టిక్ బుట్ట జాగ్రత్త. మజ్జిగ అదీ ఒలికిపోతుంది. సీటు కింద సరిగా పెట్టండి". ఆర్డర్లు జారీ చేసింది.

అతను మొహం గంటు పెట్టుకొని చెప్పినవన్నీ చేశాడు. నెరియబోతున్న జుట్టు, పిచ్చి రంగు ప్యాంటు, షర్టు, ఓ ఇంజనీర్, మంచి ఉద్యోగంలో ఉన్న మనిషిలా కాక సామాన్య గృహస్థులా మారిన అతని ముదురు మొహం, నాజూకుతనం లేని ప్రవర్తన చూసి, 'ఇతనితోనా రెండేళ్ళు కాపురం చేశా'ననిపించింది సుహాసినికి. సుహాసిని శ్రీదేవి వంక చిలిపిగా చూచి కళ్ళతో సౌంజ్ఞ చేసింది. ఇతనే నా మాజీ మొగుడున్నట్టు. ఆవిడకర్థం కాకపోతే మాగజైన్ మీద పెన్నుతో రాసి 'చూడండి, అతన్ని గమనించండి' అంటూ చిలిపిగా నవ్వింది.

మర్నాడు హైదరాబాద్ చేరే వరకు సుహాసినికి, శ్రీదేవికి వారిని గమనించడంతో సరిపోయింది. ఆవిడ కూర్చుని అథారిటీ చేస్తుంటే, అతను చచ్చినట్టు చేస్తున్నాడు. 'పాపని బాత్‌రూమ్‌కి తీసికెళ్ళండి, వీడి మూతి కడగండి, బయట అరటిపళ్ళు దొరికితే తెండి, దిళ్ళు, రగ్గులు తీసి బెర్తు దించి పక్క వేయండి' అంటూ అతన్ని ఒక్కక్షణం విశ్రాంతిగా ఉండనీయకుండా ఊదరగొట్టింది. సుహాసినితో మాటలు కలిపింది. ఎక్కడికెడుతున్నారు అంటూ మొదలు పెట్టి, సుహాసిని కావాలనే తాను పెద్ద కంపెనీలో ఇంజనీర్ననీ, అమెరికాలో ఉంటాననీ గొప్పగా చెప్పింది. మీవారేం చేస్తారు అంటే, సుహాసిని కొంటెగా "లేరు" అంది. "అయ్యో పోయారా ఇంత చిన్న వయసులో" అని అనబోతుంటే, "పోలేదు. నిక్షేపంలా ఉన్నాడు. వదిలేశా మొగుడిని" అంటే, తెల్లబోతూ చూసింది.

"ఈ బాబు" "నా బాబే" అంది. ఆమె కాస్త అర్థం కానట్టు "ఎలా" అంది. "ఎలా ఏమిటి? పిల్లాణ్ణి కనడానికి మొగుడుండా లేమిటి, మగాడు చాలు" కొంటెగా నవ్వింది. అతను కసిగా సుహాసిని వంక చూశాడు. సుహాసిని నిర్లక్ష్యంగా నవ్వింది. ఆమె తెల్లబోతూ, "మొగుడు లేకుండా కంటారా. అక్కడే మనరా" అంటే, "ఎవరేం అంటారు. నా ఇష్టం. నా పిల్లాడు" అంది. ఆవిడతో కావాలనే బాబు తెలివితేటలు, వాడి చదువు, తన జీతం, అమెరికాలో తన ఇల్లు, స్విమ్మింగ్‌పూల్-అడగనివి, అడిగినవీ అన్నీ చెప్పింది. అతను మొహం ఎక్కడ పెట్టుకోవాలో తెలీనట్టు పుస్తకం వెనక తల దాచుకున్నాడు.

"మీ ఆయన్ని ఎందుకు వదిలేశారు? ఆయన మంచివాడు కాదా?" అంది ఆమె. "ఉత్త వెధవండి! ఆడదాన్ని గౌరవించడం తెలీదు. ఆడదంటే కాళ్ళక్రింద పడుండాలని అనుకునేవాడు. నా చదువు, ఉద్యోగం అదీ చూసి కుళ్ళి, ఏడ్చి సాధించి చంపేవాడు. చూడండి మీవారెంత చక్కగా మీకు అన్ని పనులూ చేసి పెడుతున్నారో, నా మొగుడు, ఇటు పుల్ల అటు పెట్టకుండా చాకిరీ ఆడదాని వంతన్నట్టు ప్రవర్తించేవాడు. మీలా చక్కగా మొగుడు చేత అన్నీ చేయించుకునే తెలివి ఉండాలి. అప్పుడే కుక్కిన పేనులా

ఉంటారు ఈ మొగుళ్ళు" అని అంటించింది.

ఆమె చాలా గర్వంగా, "అవునండీ, కాకపోతే అణగదొక్కేస్తారు. మీరన్నది నిజమే. మా ఆయన్ని నేనలా ఊరుకోనులెండి" అంది గొంతు తగ్గించి, సుహాసిని చిలిపిగా నవ్వింది. డాక్టర్ శ్రీదేవి ఈ ఫార్స్ అంతా చూస్తూ సుహాసిని చేయి గిల్లింది. "చాల్లే పాపం. మానవుడు మొహం ఎక్కడ దాచుకోవాలో తెలియక కొట్టుకుంటున్నాడు" అంది గుసగుసగా.

"కావాలి. నా కక్ష అంతా తీర్చుకునే అవకాశం వచ్చింది వదలను. ఇంకా చూడండి" అంది నవ్వి. రాత్రి పడకునేవరకు అమెరికా మాటలు చెప్పింది.

తెల్లారి హైదరాబాద్ స్టేషన్ రాగానే బతుకుజీవుడా అన్నట్టు అతను అందరి కంటే ముందు సామాన్లు గుమ్మం దగ్గరకు చేర్చి దింపేశాడు.

కంపార్ట్మెంట్ దిగాక పక్క ఆమె వంక చూసి చిన్నగా నవ్వి, చెయ్యి పట్టుకుని కాస్త పక్కకు లాగి, "మీకో సంగతి చెప్పనా? అంటూ చెవిలో ఏదో ఊదింది. సుహాసిని. ఆవిడ మొహం తెల్లగా పాలిపోయింది. తెల్లబోతూ చూస్తున్న ఆమెని అలాగే వదిలి బాబు చెయ్యి పట్టుకుని జనంలో కలిసింది సుహాసిని. "ఏం చెప్పావు ఆమెకి? అంది శ్రీదేవి కుతూహలంగా.

"అతని మొదటి భార్యనని, ఈ పిల్లాడు అతని కొడుకేనన్న రహస్యం చెప్పేశా. తన్నుకు చావనీండి వాడిని" అంది.

"ఇంటికెళ్ళాక పెళ్ళాం జన్మంతా సాధిస్తుంటుంది. అదే శిక్ష నన్ను కాల్చుకు తిన్నందుకు" అంది నవ్వుతూ, "మంచి కాలక్షేపమే ఈ ప్రయాణంలో దొరికింది" అంది శ్రీదేవి నవ్వి.

◆ ఇండియా టుడే, ఫిబ్రవరి-2003

కథా నిలయం
5448
శ్రీకాకుళం